# నమస్తే తెలంగాణ
# సిద్దిపేట
I హైదరాబాద్, మంగళవారం 24 జూన్ 2025 SIDDIPET




గుమ్మడిదల హైవే టోల్‌ప్లాజా వద్ద మాజీ మంత్రి హరీశ్‌రావుకు స్వాగతం పలుకుతున్న బీఆర్‌ఎస్ గుమ్మడిదల, జిన్నారం మండలాల నాయకులు

## మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఘన స్వాగతం

గుమ్మడిదల, జూన్ 23: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణానికి వెళ్తుండగా బీఆర్‌ఎస్ గుమ్మడిదల, జిన్నారం మండలాల నాయకులు జాతీయరహదారిపై స్వాగతం పలికారు. సోమవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, జి.వెంకటేశంగౌడ్, యావన్నగారి సంతోష్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఉద్యమ నాయకుడు మందభాస్కర్‌రెడ్డిలు మాజీ మంత్రి హరీశ్‌రావుకు గుమ్మడిదల టోల్‌ప్లాజా వద్ద స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ మంత్రిని శాలువాలతో సన్మానించి ఆయనతో పాటు నర్సాపూర్ కార్యక్రమానికి తరలివెళ్లారు.



మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం జక్కపల్లిలో శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పలకరిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

## ఏం ఉద్ధరించారని ఉత్సవాలు ?

- మంత్రి తుమ్మలపై సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు మండిపాటు

నర్సాపూర్, జూన్ 23: ''మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఉత్సవాలు చేసుకోవాలంటున్నాడు... ఏం ఉద్ధరించారని ఉత్సవాలు జరుపుకొంటారని'' మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు మండిపడ్డారు. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలోని జక్కపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆయన మాట్లాడారు. రైతుభరోసా ఎగ్గొట్టినందుకా... రైతులకు బేడీలు వేసి జైలుకు పంపినందుకా... ఎందుకు రైతులు ఉత్సవాలు జరుపుకోవాలంటూ ఘాటుగా ప్రశ్నించారు. పంచాయతీ ఎన్నికల్లో లబ్ధిపొందాలని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రైతుభరోసా ఇచ్చిందని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రికి చిత్తశుద్ధి ఉంటే గత యాసంగి, వానకాలానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న రైతుభరోసా వేసి ఉత్సవాలు జరుపుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాటుకు నాటుకు రైతుబంధు వేస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓట్లకు ఓట్లకు రైతుభరోసా వేస్తున్నాడని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ హయాంలో కేసీఆర్ 11సార్లు రైతుబంధు రైతుల ఖాతాల్లో జమచేశారుని గుర్తుచేశారు. కరోనా సమయంలో కూడా రైతుబంధును ఆపలేదని వెల్లడించారు. వంద రోజుల్లో గొల్లకుర్మలకు గొర్రెలు పంపిణీ చేస్తామని చెప్పి మాటతప్పారని, గాంధీభవన్‌కు గొర్రెలను తీసుకువచ్చారని ఎద్దేవా చేశారు. ఇప్పటి వరకు రైతులకు ఒక్క రూపాయి కూడా బోనస్ పడలేదని మండిపడ్డారు. ఫర్టిలైజర్ దుకాణాల్లో డీఏపీ కొరత ఉందని, రైతులకు దొరకడం లేదన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో ఢిల్లీ నుంచి సంవత్సరానికి పదుల సంఖ్యలో అవార్డులు వచ్చేవని రేవంత్‌రెడ్డి పాలనలో ఒక్కటి కూడా రావడం లేదని ఎద్దేవా చేశారు. అంతకు ముందు మండలంలోని చిప్పల్‌తుర్తి గ్రామాన్ని సందర్శించి పారిశుధ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రాక్టర్‌లో డీజిల్‌కు డబ్బులు లేక 20 రోజుల నుంచి చెత్తతీయడం లేదని అసహనం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్మికులకు మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో వాళ్ల కుటుంబాల పరిస్థితి దారుణంగా మారిందన్నారు. పంచాయతీ సెక్రటరీ సొంతంగా రూ.80 వేలు అప్పు చేసి పంచాయతీ పనులను నెట్టుకొస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని గ్రామపంచాయతీలకు నిధులు విడుదల చేసి గ్రామాలను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.



మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలోని చిప్పల్‌తుర్తిలో పంచాయతీ కార్యదర్శితో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

# బీఆర్‌ఎస్‌కు కార్యకర్తలే ఆయువుపట్టు



మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలోని జక్కపల్లిలో శ్రీనివాస్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, బీఆర్‌ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి తదితరులు



విగ్రహావిష్కరణకు హాజరైన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

- నిజాయితీకి మారుపేరు జక్కపల్లి శ్రీనివాస్
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలోని జక్కపల్లిలో దివంగత జక్కపల్లి శ్రీనివాస్ విగ్రహావిష్కరణ
- హాజరైన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, బీఆర్‌ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి

నర్సాపూర్, జూన్ 23: బీఆర్‌ఎస్‌కు కార్యకర్తలే ఆయువుపట్టు అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలోని జక్కపల్లిలో మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు దివంగత జక్కపల్లి శ్రీనివాస్ విగ్రహాన్ని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, బీఆర్‌ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ నిజాయితీకి మారుపేరు దివంగత జక్కపల్లి శ్రీనివాస్ అని, అతన్ని కోల్పోవడం బీఆర్‌ఎస్ పార్టీకి తీరని లోటన్నారు. వరుసగా మూడుసార్లు సర్పంచ్‌గా గెలువడమే శ్రీనివాస్ నిజాయితీ తెలుస్తుందన్నారు. వేరే పార్టీలోకి రావాలని ఎన్నో ఆఫర్లు వచ్చినా కేసీఆర్ నాయకత్వాన్ని, బీఆర్‌ఎస్ పార్టీని అతడు వీడలేదని గుర్తుచేశారు. విగ్రహాన్ని ఏర్పాటు చేసినందుకు మాజీ ఎంపీటీసీ సంధ్యారాణీఛత్రూనాయక్‌ను అభినందించారు. కార్యకర్తలు, నాయకులే పార్టీకి ఆయువుపట్టు అని, వారికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వెల్లడించారు. నర్సాపూర్ రెవెన్యూ డివిజన్ కావాలని పట్టుబడి కొట్లాడిన వారిలో శ్రీనివాస్ దంపతులు ఒకరని గుర్తుచేశారు. ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ శ్రీనివాస్ లాంటి గొప్ప కార్యకర్తను కోల్పోవడం చాలాబాధగా ఉందన్నారు. ప్రజల మధ్య ఉంటూ సమస్యలు పరిష్కరించే గొప్ప వ్యక్తి శ్రీనివాస్ అని కొనియాడారు. ఆరోగ్యం బాగా లేకున్నా సమస్యలు పరిష్కరించి ఇంటికి వచ్చిన తర్వాత కుప్పకూలి మరణించాడని గుర్తుచేశారు. శాంతిమార్గంలో సమస్యలు పరిష్కరించేవాడన్నారు. శ్రీనివాస్ కుటుంబానికి ఏ ఆపద వచ్చినా ముందుంటానని వెల్లడించారు. అనంతరం బీఆర్‌ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీనివాస్ కుటుంబానికి బీఆర్‌ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. తెలంగాణ ఉద్యమకాలంలో శ్రీనివాస్ చురుగ్గా పనిచేశాడని, మండలంలోనే మంచి వ్యక్తిగా పేరు సంపాదించుకున్నాడని తెలిపారు. శ్రీనివాస్ భార్య, మాజీ సర్పంచ్ వెంకటలక్ష్మి, లేబర్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, మాజీ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు సత్యంగౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, జడ్పీ కో-ఆప్షన్ మాజీ సభ్యుడు మన్సూర్, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ శివకుమార్, మాజీ ఎంపీటీసీ సంధ్యారాణి ఛత్రునాయక్, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ కమిటీలు రద్దు చేయాలి

- సిద్దిపేటలో సీపీఎం నాయకుల డిమాండ్

సిద్దిపేట అర్బన్, జూన్ 23: తక్షణమే ఇందిరమ్మ కమిటీలు రద్దు చేసి, అర్హులైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిద్దిపేట పట్టణంలోని సిద్దిపేట అర్బన్ తహసీల్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించి.. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇందిరమ్మ కమిటీల పేరుతో కేవలం కాంగ్రెస్ నాయకులకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు పూర్తిగా అవకతవకలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వృద్ధులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు ఇస్తామని చెప్పి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో మోసపూరిత హామీలుఇచ్చిందన్నారు. ఉన్న పింఛన్ కూడా సరైన సమయంలో రావడం లేదన్నారు. మహిళలకు రూ.2500 ఇస్తామని చెప్పి 18 నెలలు గడిచినా ఇంతవరకు ఆఊసే ఎత్తడం లేదన్నారు. యువతకు రాజీవ్ యువ వికాసం పేరుతో ఆర్భాటం చేసి.. ఇప్పుడు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు.



సిద్దిపేట అర్బన్ తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

## విద్యార్థులు ఊరికి మంచిపేరు తీసుకురావాలి

- తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి

కొండపాక(కుకునూరుపల్లి), జూన్ 23: విద్యార్థులు లక్ష్యాన్ని సాధించి తల్లిదండ్రులు, పుట్టిపెరిగిన ఊరికి మంచి పేరు తీసుకురావాలని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా కొండపాక మండలంలోని బందారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మనం మన ఊరు ఉద్యోగులు ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. విద్య ద్వారా విజ్ఞానాన్ని సంపాదించి ఆయా రంగాల్లో వెలుగులు అందించాలని, తద్వారా సమాజ అభివృద్ధికి పాటుపడాలన్నారు. సాధనతో సాధ్యం కానిది ఏదీ లేదని గ్రహించి ఉన్నత లక్ష్యాలు చేరుకునేందుకు తగిన కృషిచేయాలన్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన ఎక్కలదేవి పావని, రాగుల అర్చన, కెమ్మెసారం అలేఖ్యకు సిల్వర్ మెడల్స్‌తో పాటు నగదు బహుమతులు అందజేశారు. పాఠశాలలోని విద్యార్థులకు విద్యాభ్యాసం డైరీలు అందజేశారు. హెచ్ఎం రామచంద్రం, మనం మన ఊరు అధ్యక్షుడు ఎన్.భగవాన్‌రెడ్డి, బాల్‌నర్సయ్య, మధుసూదన్‌రెడ్డి, రాజుగౌడ్, వెంకట్‌రెడ్డి, మల్లారెడ్డి, పోషాద్రి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సిద్దిపేట జిల్లా కొండపాక మండలంలోని బందారంలో విద్యార్థులకు డైరీలు అందజేస్తున్న నందిని సిధారెడ్డి



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని కొత్తూర్‌లోని ట్రైడెంట్ షుగర్ ఫ్యాక్టరీ గేటు ఎదుట ఆందోళన చేస్తున్న కార్మిక సంఘం నాయకులు, కార్మికులు

## కాళేశ్వరం నీళ్లతో మారిన గ్రామ రూపురేఖలు

- సమృద్ధిగా పంటలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు
- కేసీఆర్‌తోనే సాధ్యమైందంటున్న మెదక్ జిల్లా నిజాంపేట మండలంలోని బచ్చురాజ్‌పల్లి గ్రామస్తులు



బచ్చురాజ్‌పల్లిలో కాల్వ ద్వారా ప్రవహిస్తున్న కాళేశ్వరం జలాలు

# బచ్చురాజ్‌పల్లికి మహర్దశ

నిజాంపేట, జూన్ 23: తెలంగాణ మొదటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఆగ్రామ రూపురేఖలే మారాయి. భూగర్భజలాలు అడుగంటి రైతులు కూలీలుగా పట్టణాలకు వలస వెళ్లిన తరుణంలో కాళేశ్వరం ప్రాజెక్టు బతుకు తోవ చూపింది. రైతులు తిరిగి సొంత గ్రామానికి వచ్చి వ్యవసాయపనులు చేసుకుంటూ సంతోషంగా ఉన్నారు. మండుటెండల్లో చెరువులు,కుంటల మత్తళ్లు దుంకించిన ఘనత కేసీఆర్‌కే దక్కింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మెదక్ జిల్లా నిజాంపేట మండలంలో 19 వేల ఎకరాలకు సాగునీటిని అందించాలనే లక్ష్యంతో మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి కొండపోచమ్మసాగర్ నుంచి రామాయంపేట కెనాల్ ద్వారా కాళేశ్వరం జలాలను బచ్చురాజ్‌పల్లికి విడుదల చేశారు. గ్రామంలో ఉన్న బోలావాణి కుంట,దామర చెరువు నేటికీ నిండుకుండలా మారాయి. ఫలితంగా భూగర్భజలాలు పెరిగి స్థానికంగా ఉన్న రైతులు పంటలు సమృద్ధిగా పండించుకుంటున్నారు. కేసీఆర్ ముందుచూపుతోనే కాళేశ్వరం నీళ్లు గ్రామానికి వచ్చాయని, దానివల్లనే వలసలు తగ్గాయని, గ్రామ రూపురేఖలు మారామని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

### రందిలేకుండా పంటలు పండించుకుంటున్నాం



బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి హరీశ్‌రావు కొండపోచమ్మ సాగర్ నుంచి నీటిని విడుదల చేశారు. కాళేశ్వరం నీళ్లతో ఇప్పటికీ బోలావణి కుంట, దామరచెరువు నిండుగా ఉన్నాయి.సాగునీటికి ఎటువంటి కష్టం లేకుండా గ్రామంలో సుమారు 200 ఎకరాల మేర పంటలు పండించుకుంటున్నాం. కేసీఆర్ ముందుచూపుతో కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడం వల్ల మా ప్రాంతానికి నీళ్లు వచ్చాయి.కేసీఆర్ సార్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం.

– సత్యం, రైతు, బచ్చురాజ్‌పల్లి, నిజాంపేట మండలం, మెదక్ జిల్లా

### సంతోషంగా బతుకుతున్నాం



కాలంతో పనిలేకుండా కాళేశ్వరం నీళ్లతో వ్యవసాయం చేసుకుంటూ సంతోషంగా బతుకుతున్నాం. గ్రామంలోని దామరచెరువు కింద నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇప్పటికీ బోర్ల నుంచి సమృద్ధిగా నీళ్లు వస్తుండటంతో కాలంకోసం ఎదురుచూడకుండా పంటలు పండించుకుంటున్నాం. గతంలో సరిగ్గా నీళ్లు లేక పట్నం వలస వెళ్లి బతికినం. కేసీఆర్ కట్టించిన కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల మా గ్రామానికి నీళ్లు వచ్చాయి. కేసీఆర్ సార్ మాకు తండ్రి లెక్క.ఆయన సీఎంగా ఉన్నా లేకున్నా చేసిన పనులను ఎప్పటికీ తెలంగాణ ప్రజలు మర్చిపోరు.

–కళ్ల స్వామి, రైతు, బచ్చురాజ్‌పల్లి, నిజాంపేట మండలం, మెదక్ జిల్లా



కాళేశ్వరం జలాలతో నిండుకుండలా బచ్చురాజ్‌పల్లి దామరచెరువు

## యంత్రాలు, పరికరాలు తరలిస్తే సహించేది లేదు

- ట్రైడెంట్ షుగర్ ఫ్యాక్టరీ కార్మిక సంఘం అధ్యక్షుడు ఎంజీ రాములు
- యంత్రాలు, పరికరాలను తరలిస్తుండగా అడ్డుకున్న కార్మికులు
- యాజమాన్యంపై ఉన్నతాధికారులు, పోలీసులకు ఫిర్యాదు

జహీరాబాద్, జూన్ 23: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని కొత్తూర్ గ్రామంలోని ట్రైడెంట్ షుగర్ ఫ్యాకరీలోని యంత్రాలు, పరికరాలను అనుమతి లేకుండా తరలిస్తే సహించేది లేదని ఫ్యాక్టరీ కార్మిక సంఘం అధ్యక్షుడు ఎంజీ రాములు హెచ్చరించారు. సోమవారం స్థానిక ఫ్యాక్టరీలోని విలువైన యంత్రాలు, పరికరాలను యాజమాన్యం మహారాష్ట్రకు ఎంహెచ్ 46 బీబీ 6651, టీఎస్ 08జేసీ 0833 కంటైనర్‌లో తరలిస్తుండగా కార్మిక సంఘం నాయకులు, కార్మికులు ఫ్యాక్టరీకి చేరుకుని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఫ్యాక్టరీలో ఏర్పాటు చేసిన విలేకరులతో ఆయన మాట్లాడారు. ట్రైడెంట్ షుగర్ ఫ్యాక్టరీ ఎన్‌సీఎల్‌టీ కోర్టు పరిధిలో ఉందని, ఎలాంటి అనుమతి లేకుండా యాజమాన్యం గుట్టుచప్పుడు కాకుండా ఫ్యాక్టరీలో విలువైన పరికరాలను కంటైనర్‌లో తరలించడంపై మండిపడ్డారు. కోర్టు పరిధిలో ఉన్న ఫ్యాక్టరీ నుంచి చిన్నముక్కకూడా తరలించేందుకు వీలులేదన్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని చెరుకు రైతులకు ఎంతగానో ఉపయోగపడే షుగర్ ఫ్యాక్టరీలోని యంత్రాలు, పరికరాలను తరలిస్తూ కార్మికులను రోడ్డున పడేసేందుకు ప్రయత్నిస్తుండడం సరికాదన్నారు. ఫ్యాక్టరీలో పనిచేస్తున్న 150 మందికి పైగా ఉన్న కార్మికులకు రూ.7 కోట్లకు పైగా బకాయి వేతనాలు చెల్లించాల్సి ఉందన్నారు. పీఎఫ్ కింద మరో రూ.కోటి వరకు చెల్లించాల్సి ఉన్నా నేటికీ కార్మికులకు చెల్లించలేదన్నారు. కార్మికులు ఫ్యాక్టరీకి రాకపోవడంతో యాజమాన్యం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఎలాంటి అనుమతులు లేకుండా విలువైన పరికరాలను తరలిస్తుందన్నారు. గత మార్చిలో ఫ్యాక్టరీ చుట్టూ రేకులతో కంచె ఏర్పాటు చేసి, పగటి పూట గ్యాస్ కట్టర్లతో పరికరాలను ముక్కలు ముక్కలు చేసి రాత్రి సమయాల్లో లారీల్లో తరలిస్తుండగా అడ్డుకున్నామన్నారు. అప్పట్లో కార్మికులకు వేతనాలు చెల్లించిన తర్వాతే యంత్రాలు, పరికరాలను తరలిస్తామని ఫ్యాక్టరీ యాజమాన్యానికి చెందిన ఆర్‌పీ మంజీత్ భూచ్చ హామీ ఇచ్చారన్నారు.ఫ్యాక్టరీ నుంచి యంత్రాలు, పరికరాలను తరలిస్తే కార్మికుల కుటుంబాలతో అడ్డుకుంటామని హెచ్చరించారు. కోర్టు తీర్పు వచ్చే వరకు ఫ్యాక్టరీ చిన్న ముక్కకూడా తరలించేందుకు వీలు లేదని, కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న యాజమాన్యం తీరుపై అగ్రహం వ్యక్తం చేశారు. ఒకవేళ యాజమాన్యం ఫ్యాక్టరీని విక్రయించాలనుకుంటే ఫ్యాక్టరీని నడిపించి, క్రషింగ్ చేస్తామనే యాజమాన్యాలకు విక్రయించాలన్నారు.అనంతరం ఫ్యాక్టరీ నుంచి యంత్రాలు, పరికరాలు తరలించేందుకు తీసుకువచ్చిన కంటైనర్లపై జహీరాబాద్ రూరల్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు ఫ్యాక్టరీకి చేరుకుని కంటైనర్‌ను రూరల్ పోలీస్ స్టేషన్ తీసుకువెళ్లారు.